క్లుప్తంగా

నేడు కుక్కలు, పిల్లులకు ఉచిత టీకాలు

హయత్‌నగర్: జాతీయ జునోసిస్ డే (జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించే రోజు)ను పురస్కరించుకుని గురువారం పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు హయత్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించి రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందకుండా సహకరించాలని ఆయన కోరారు.

రేపు ఆమనగల్లులో లలితాసహస్రనామ యజ్ఞం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి డా.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, 8 గంటలకు గోమాత పూజా కార్యక్రమం, 9 గంటలకు ప్రత్యేక పూజలు, 11 గంటలకు లలితా సహస్రనామయజ్ఞం, 12 గంటలకు సామూహిక కుంకుమార్చన.. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


వెంకటేశ్వర్లు, సీఐ, ఆమనగల్లు

ఆమనగల్లు: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు కోరారు. ఆమనగల్లు సీఐగా పనిచేస్తున్న ఉపేందర్ ఇటీవల అల్వాల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అవ్వగా.. చేవెళ్లలో సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఆమనగల్లుకు బదిలీ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం జె.వెంకటేశ్వర్లు సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐని.. ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య, కడ్తాల ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, తలకొండపల్లి ఎస్ఐ వెంకటేశ్ సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాదారంలో నిర్మాణంలో ఉన్న మైసమ్మ తల్లి ఆలయానికి రావిచేడ్ గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రూ.30 వేలు, నాయకులు బాలకృష్ణ రూ.10వేలు విరాళం అందించారు. ఈ మేరకు బుధవారం దాతలను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, మైసయ్య,గిరి, అంజయ్య, శ్రీరాములు, గోపాల్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన పలువురు యువకులు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇబ్రహీంపట్నంకు చెందిన మనోజ్‌కుమార్, సంపత్, వంశీ, భాను, శివ, రాకేష్, కార్తీక్ తదితరులు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు గురునాథ్‌రెడ్డి, మంఖాల దాసు, ఆకుల ఆనంద్, ఫిరోజ్, విద్యాసాగర్, సుబ్బూరు పాండు, కరుణాకర్, శ్యాంలాల్, నాగార్జున, కిరణ్, సోహెల్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత


బ్యాగులు అందజేస్తున్న అతిథులు

ఇబ్రహీంపట్నం రూరల్: శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తులేకలాన్ సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ నాగమణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తులేకలాన్‌లో ఆప్టం సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు ఎంపీయుపీఎస్ విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ సామగ్రి, స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఎంఎస్ఓ గోవర్ధన్, అరవింద్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి,యాదగిరి, బాషా, జగదీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

మంచాల: మండల పరిధిలోని చెన్నారెడ్డి గూడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు యాదయ్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి స్వామి, నాయకులు ప్రహ్లాద్, వెంకటేష్, చంద్రయ్య, పాండు, సబిత, భాస్కర్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- అసంపూర్తిగా కడ్తాల్–గుర్లకుంటతండా రోడ్డు నిర్మాణం
- 5 నెలలు దాటినా పూర్తికాని పనులు
- వర్షాలు కురిస్తే ఇబ్బందులు తప్పవంటున్న గిరిజనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


కడ్తాల్-గుర్లకుంటతండా రహదారి

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్లకుంట తండా రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి 5 నెలలు దాటినా నేటికి పనులు పూర్తికాలేదు. వివరాల్లోకి వెళ్తే.. కడ్తాల్-గుర్లకుంటతండా రోడ్డు పనులకు భూమిపూజ చేసి ఐదు నెలలు పూర్తయ్యాయి. అయినా నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. గుర్లకుంట తండాకు వెళ్లాలంటే చెరువుకట్ట మీదుగానే రాకపోకలు సాగించాలి. దీంతో వర్షాకాలంలో తండా నుంచి గిరిజనులు కడ్తాల్ వెళ్లాలంటే.. అనేక ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. గుర్లకుంటతండాకు వెళ్లే దారిలో చెరువు కట్ట ప్రారంభంలోనే వర్షాకాలంలో అలుగు పారుతుంది. అలుగు పారే సమయంలో రాకపోకలు నిలిచిపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

జనవరిలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ..

గిరిజనుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం గతేడాది చివర్లో కడ్తాల్ నుంచి గుర్లకుంటతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు రూ.కోటి మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణానికి ఈ ఏడాది జనవరిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. అయితే గుత్తేదారు పనులను వేగవంతంగా చేయకపోవడంతో నేటికీ పనులు పూర్తికాలేదు. కేవలం రోడ్డుకు ఇరువైపులా షోల్డర్ వర్క్ పూర్తిచేసి వదిలేశారు. నిర్ణీత సమయంలోపు పనులు పూర్తిచేయకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు మట్టిరోడ్డు చిత్తడిగా మారుతోందని తండావాసులు వాపోతున్నారు. బీటీ పూర్తయితే మండల కేంద్రంతో పాటు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలకు ఇబ్బందులుండవని తండావాసులు అంటున్నారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని, అదేవిధంగా కుంట అలుగు వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి



నాలుగు నెలల క్రితం రోడ్డు నిర్మాణం కోసమని చెరువు కట్టపైన ఇరువైపులా మట్టిపనులు చేసి తదనంతరం పనులు నిలిపివేశారు. వర్షాలు ప్రారంభమైతే రాకపోకలకు ఇబ్బందులు తప్పేలా లేవు. వెంటనే బీటీ రోడ్డు పనులు పూర్తిచేయాలి.

– హన్మానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుర్లకుంటతండా

త్వరలో పూర్తిచేస్తాం



రోడ్డు నిర్మాణ పనుల విషయమై గుత్తేదారుతో మాట్లాడాను. నిర్మాణ పనుల్లో తాత్సారం వల్ల గిరిజనులు పడుతున్న ఇబ్బందులను వివరించాను. వారం పదిరోజుల్లో మిగితా పనులు ప్రారంభిస్తామన్నారు. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– పరమేశ్, పీఆర్ఏఈ, కడ్తాల్

ప్రసన్న చదువుకు అండగా ఉంటాం

ఉప్పల ట్రస్టు చైర్మన్ వెంకటేశ్


ప్రసన్నకు చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: తండ్రి కోల్పోయిన ఆడపిల్లల చదువుకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కూతురు ప్రసన్న ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ చదువుతుంది. అయితే శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల మృతిచెందా డు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతుండగా స్థానిక నాయకుడు, ఎంపీటీసీ ర మేష్ సహకారంతో ప్రసన్న జెడ్పీటీసీని వెంకటేశ్‌ను కలిసి తన చదువుకు సహాయం చేయాలని కోరింది. స్పందించిన వెంకటేశ్ ట్రస్టు ద్వారా ప్రసన్నను చదివిస్తానని.. ఆమె ఉన్నత చదు వుకయ్యే ఖర్చులను తానే భరిస్తానని భరోసా పలికారు. ట్రస్టు సభ్యులచే తక్షణ సహాయంగా బుధవారం రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జోగు రమేష్, ఉప సర్పంచ్ పాండు, గోవిందారెడ్డి, సాయి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన పాతకోట రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు నాగిళ్ల జగన్ పరామర్శించారు. ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలను నాగిళ్ల జగన్‌కు అందజేశారు. స్థానిక నాయకులు అంజద్, మహేశ్, సైదులు, మజీద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కడ్తాల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరంలాంటిదని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన సరోజకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.16 వేలు మంజూరయ్యాయి. బుధవారం మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ రమేష్, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు ఉన్నారు.

వెల్జాల్‌కు చెందిన హబీబ్‌కు..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన హబీబ్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్‌రహ్మాన్, దస్తగిరి, రాజు, బుచ్చయ్య, శ్రీశైలం , వెంకటయ్య, మన్నాన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా నాయకుడు కురుమయ్య


ఎంపీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కడ్తాల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా నాయకుడు గుమ్మడి కురుమయ్య అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 6 నుంచి పంచాయతీ కార్మికులు చేపట్టనున్న సమ్మె నోటీస్‌ను బుధవారం మండల కేంద్రంలో ఎంపీవో మధుసూధనాచారికి వారు అందజేశారు. కురుమయ్య మాట్లాడుతూ.. పంచాయతీల్లో పనిచేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ 60 పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం ప్రతి సిబ్బందికి రూ.19 వేతనం చెల్లించాలని, జీఓ 60లో పేర్కొన్న విధంగా కారోబార్, బిల్‌కలెక్టర్, ఎలక్ట్రిషియన్, వాటర్‌మెన్ కేటగిరిల వారీగా పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి అన్నిరకాల కార్మిక చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటమ్మ, రవి, మల్లయ్య, లక్ష్మమ్మ, మహేశ్, చెన్నయ్య, అంజయ్య, భవానీ, సరస్వతి, లక్ష్మయ్య, నర్సింహ ఉన్నారు.

ఈటల రాజేందర్‌కు సన్మానం


ఈటలను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఎన్నికలకు సిద్ధం కావాలని హుజూరాబాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఈటల రాజేందర్‌ను పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా బుధవారం ఆయన నివాసానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నేతలు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. వారినుద్దేశించి ఈటల మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు భాస్కర్, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు..

తుర్కయంజాల్: బీజేపీ ఎన్నికల నిర్వాహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బుధవారం పలువురు ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నోముల దయానంద్ గౌడ్, వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేవరకు పోరాటం

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి


ధర్నాలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నిత్యారెడ్డి

మంచాల: వరిధాన్యం కొనుగోలు వ్యవహారంలో రైతులకు న్యాయం జరిగేవరకు పోరాడుతామని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు బుధవారం మంచాల మండల కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచాల మండలంలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. 965 మంది రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేసి 200 మందికి మాత్రమే డబ్బులు ఇచ్చారని తెలిపారు. ఇంకా 765 మందికి ఇవ్వలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో 40కిలోల బస్తాకు ఆరు కిలోల చొప్పున తరుగు పేరుతో దోపిడీ చేశారు. అంతేగాకుండా 100 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి 95 బస్తాలు మాత్రమే లెక్కలు రాశారన్నారు, పెద్ద మొత్తంలో రైతులను మోసం చేసి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులు వెంటనే ఇవ్వాలన్నారు. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై రవినాయక్ ధర్నా చేస్తున్న వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, చీదేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, బండలేమూర్ సర్పంచ్ మంగ, ఎంపీటీసీ సభ్యులు నరేందర్‌రెడ్డి, జయానందం, రాందాస్, మండల కోఆప్షన్ సభ్యుడు వాజిద్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోన్‌యాప్‌లతో మోసపోవొద్దు

ఆదిబట్ల సీఐ రవికుమార్


మాట్లాడుతున్న సీఐ రవికుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: లోన్ యాప్‌లతో మోసపోవొద్దని ఆదిబట్ల సీఐ రవికుమార్ పేర్కొన్నారు. బొంగ్లూర్ ఎక్స్‌రోడ్డులోని ఎస్ఆర్ గాయత్రీ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దన్నారు. తెలియక చేసే చిన్న పొరపాట్ల వల్ల వ్యక్తిగత సమాచారం తెలుసుకొని సైబర్ చోరులు బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారన్నారు. సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో చాట్ చేయకూడదన్నారు. ఫొటోలు షేర్ చేయవద్దని తెలిపారు. బ్యాంకు వివరాలు, ఓటీపీ వివరాలు పంచుకోకూడదన్నారు. లోన్ యాప్‌ల ద్వారా ఇబ్బందులు ఎదురైతే పోలీసులను సంప్రదించాలని.. ఫోన్‌లో మీ వ్యక్తిగత సమాచారం అడిగితే స్పందించవద్దన్నారు. ఎస్ఐ వెంకటేష్, ఏఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజు, సురేష్, వెంకటేష్, శారద, మహేందర్, ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టవా?

- వాడీవేడిగా మంచాల సర్వసభ్య సమావేశం
- ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ చేస్తున్నారంటూ ప్రతిపక్షాల ఆందోళన
- వేదిక ఎదుట బైఠాయింపు, సమావేశం బహిష్కరణ


వేదిక ఎదుట బైఠాయించిన ప్రతిపక్ష సభ్యులు

మంచాల: అధికారపక్షం–ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదాలతో మండల సర్వసభ్య సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రతిపక్షాలు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయినా కూడా సభను కొనసాగించారు. అందుకు సంబంధించిన వివరాలు.. ఎంపీపీ నర్మద అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కావడంతోనే వ్యవసాయశాఖకు సంబంధించి చర్చ మొదలుపెట్టారు. వరిధాన్యం కొనుగోలు విషయంలో నెలకొన్న అక్రమాలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన మంచాల, లింగంపల్లి ఎంపీటీసీ సభ్యులు నరేందర్‌రెడ్డి, జయానందం నిలదీశారు. వరిధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో ఎంపీపీ నర్మద వరిధాన్యం కొనుగోలు చేసిన డీసీఎంఎస్ అధికారులకు సమావేశంలోనే ఫోన్ ద్వారా విషయం తెలిపారు. అరగంటలో వస్తామని డీసీఎంఎస్ అధికారులు తిరిగి బదులిచ్చారు. వారు వచ్చే వరకు సమావేశం కొనసాగించవద్దని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. వారికి ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, చీదేడ్ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, తిప్పాయిగూడ సర్పంచ్ పాండు, బండలేమూర్ సర్పంచ్ మంగ, కోఆప్షన్ సభ్యుడు వాజిద్, ఆంబోత్ తండా ఎంపీటీసీ సభ్యుడు రాందాస్ మద్దతుగా నిలిచారు. దీంతో గంటసేపు సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి సమావేశం ప్రారంభమైనా డీసీఎంఎస్ అధికారులు సమావేశానికి రాకపోవడంతో మరలా ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. రైతుల నుంచి 40కిలోల వరిధాన్యం కొనుగోలు చేసి బస్తాకు 6కిలోల చొప్పున దోపిడీ చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించాలని పట్టుబట్టారు. సమస్యను తప్పుదోవ పట్టించే విధంగా అధికారులు, అధికార పక్ష సభ్యులు వ్యవహరించడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం జరపొద్దంటూ సభాస్థలి ఎదుట ప్రతిపక్ష సభ్యులు బైఠాయించారు. దీంతో అధికార–ప్రతిపక్షాల సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎంపీపీ నర్మద మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోలు విషయంపై మరోరోజు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని సర్దిచెప్పినా ప్రతిపక్షాల సభ్యులు వినలేదు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. రెండుగంటల పాటు ఆందోళన అనంతరం ప్రతిపక్షాలు సమావేశాన్ని బహిష్కరించాయి. అయినప్పటికీ ఎంపీపీ నర్మద సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆరుట్ల, తాళ్లపల్లిగూడ, దాద్‌పల్లి, చెన్నారెడ్డి గూడ ఎంపీటీసీ సభ్యులు చీరాల రమేష్, సుకన్య, అనిత, పరంగా, తాళ్లపల్లి గూడ, మంచాల, ఆంబోత్‌తండా, లోయపల్లి సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రఘు, అనిత, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ తేజ్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15వ వార్డులో శ్రమదానం

ఆమనగల్లు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని 15వ వార్డు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులోని పలు కాలనీల్లో బుధవారం కాలనీవాసులు, సిబ్బందితో కలిసి ఆయన శ్రమదానం నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. గుంతలు ఉన్నచోట మట్టిని పోసి చదునుచేశారు.

యాచారం సీఐగా సైదయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ సైదయ్య

యాచారం: యాచారం పోలీస్ స్టేషన్ సీఐగా సైదయ్య బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ లింగయ్య యాదాద్రి ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. సైదయ్య యాదగిరిగుట్ట టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి యాచారం బదిలీపై వచ్చారు. మండలంలో ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షిస్తామని సీఐ సైదయ్య తెలిపారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి

ఎంపీపీకి కొత్తపల్లి ఉపసర్పంచ్ వినతి

యాచారం: గ్రామాభివృద్ధికి రూ.10 లక్షల నిధులు ఇవ్వాలని కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కావలి జగన్, వార్డు సభ్యుడు శ్రీనువాస్‌గౌడ్ బుధవారం ఎంపీపీ కొప్పు సుకన్యకు వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆమెను కలిసిన నేతలు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు లేవని.. నిధులు ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని ఆమెను కోరారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి మూడోరోజుకు చేరుకున్నాయి. గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేవరకు దీక్ష విరమించేది లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామస్తుల డిమాండ్‌ను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మర్ విక్టోరియాకు ఎమ్మెల్సీ అభినందన


విక్టోరియాను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో స్విమ్మర్ క్వీని విక్టోరియా రెండు రజత పతకాలను సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. స్విమ్మింగ్ పోటీల్లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈజిప్ట్ దేశ రాజధాని కైరోలో గత నెలలో జరిగిన అంతర్జాతీయ అండర్ వాటర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆమనగల్లుకు చెందిన క్వీని విక్టోరియా ప్రతిభ కనబర్చి రెండు రజత పతకాలు సాధించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి.. స్విమ్మర్ క్వీని విక్టోరియా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, నాయకులు విజయ్, గోలి సురేందర్‌రెడ్డి, రమేశ్, పోలెపల్లి సర్పంచ్ బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ భవనానికి స్థల పరిశీలన

కడ్తాల్: మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ఇటీవల ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడంతో.. భవన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకు సమీపంలోని ఓ వెంచర్‌లో జీపీకి కేటాయించిన 10 శాతం భూమిని వారు పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ఏఈ పరమేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీఓ మధు సూధనాచారి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, నాయకులు రమేశ్ ఉన్నారు.

మిల్లర్ల తప్పులను ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారు

కాంగ్రెస్ నేతలపై ఎంపీపీ నర్మద ఫైర్

మంచాల: రాష్ట్రంలో రైతుల మేలుకోరే పార్టీ కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని ఎంపీపీ నర్మద, ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. బుధవారం మంచాలలో ఎంపీపీ నర్మద.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో ఎస్టీ మహిళా ప్రజాప్రతినిధిని చులకన భావనతో వ్యవహరించారంటూ ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి వరిగింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రైస్‌మిల్లర్లు చేసిన తప్పిదాలకు ప్రభుత్వాన్ని తప్పుబట్టి సమావేశాన్ని అడ్డుకోవడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు కేసీఆర్ వెంటే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అనిత, సుకన్య, పరంగి, జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం

ఇబ్రహీంపట్నం: ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు.. మండుతున్న ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఇబ్రహీంపట్నం ప్రజలకు ఊరటను కల్పించాడు. మంగళవారం అర్ధరాత్రి ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం కురిసింది. సుమారు 57.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైయింది. గత నెలలో మబ్బులు కమ్ముకోవడం, ఈదురుగాలులు వీచడం చిటపట చినుకులే తప్ప జోరుగా వర్షం కురిసిందిలేదు. కేవలం 22 నుంచి 25వ తేదీ వరకు కురిసిన వర్షం 40 మి.మీటర్లు దాటకపోవడం గమనార్హం.దుక్కిదున్ని విత్తనాలు నాటుకునేందుకు సరిపడా వర్షాలు కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వరుణుడి కోసం నిరీక్షించారు. మంగళవారం రాత్రి, బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇలాగే రెండుమూడు రోజుల పాటు వర్షాలు కురిస్తే పంటల సాగుకు ఎంతో అనువుగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.